క్లుప్తంగా

బాలబాలికల బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

చంద్రగిరి (తిరుచానూరు): అండర్-14, 17 బాలబాలికల బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక కోసం శనివారం తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలబాలికల పాల్గొన్నారు. ఈ పోటీల రెఫరీగా తిరుచానూరు ఉన్నత పాఠశాల పీడీ సురేంద్రబాబు వ్యవహరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టు కు ఎంపిక చేశారు. వారిని హెచ్ఎం మురళి అభినందించి బహుమతులు అందజేశారు. అండర్ -14 బాలుర జట్టులో 11 మంది, అండర్ -17 బాలికల జట్టులో 15 మంది, అండర్ -17 బాలురు జట్టులో 13 మంది ఎంపికై నట్లు తిరుచానూరు ఉన్నత పాఠశాల పీడీ సురేంద్రబాబు తెలిపారు. వీరు త్వరలో మచిలీపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు పళణి, ప్రభాకర్, పూర్ణ శరత్‌చంద్ర, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గోవర్ధన పూజ



మహా శంఖాభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుడు తన చిటికెన వేలితో గోవర్ధన గిరిని ఎత్తి గోవులు, యాదవులను కాపాడిన రోజును పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో శనివారం గోవర్ధన పూజను అత్యంత వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా కమలమందిరంలో శ్రీరాధా గోవిందులు, అష్టసఖులు కొలువైన గర్భగుడిని విశేషంగా అలంకరించారు. ఉదయం 4.30 గంటలకు మంగళ హారతి, 7.30 గంటలకు ప్రత్యేక దర్శన హారతి సమర్పించారు. 8 గంటలకు గురు పూజ చేపట్టారు. 12 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీగిరి గోవర్ధనుడికి మహా శంఖాభిషేకం నిర్వహించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ గోవర్ధన లీలల ప్రవచనం చేశారు. గోశాలలో గోపూజ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం కార్యదర్శి లీలాపారాయణదాస్, ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మండల అభివృద్ధి

పాకాల: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీటి సరఫరా, వైద్యసేవల్లో సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈ-పాలగుట్టపల్లిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేశామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీడీవో శశిరేఖ, తహసీల్దార్ నిత్యానందబాబు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో డిసెంబర్ 1వ తేదీన అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు గోల్డ్ ఇన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్, నేషనల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ప్యాట్రన్ ఎ.ఈశ్వరప్రకాష్ తెలిపారు. వారు శనివారం జోష్ ప్రాపర్టీస్ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. గోల్డెన్ ఇండియా ఫెడరేషన్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల పోటీలను తిరుపతిలో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు మెడల్స్ అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9505873777, 7013274433 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.హరి, బద్రి, అరుణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అనధికార మద్యం విక్రయాలు

తిరుపతి రూరల్: ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుతో అనధికార మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. ప్రతి పల్లెలోనూ బెల్ట్ షాపుల విష సంస్కృతి మొదలైంది. ఎక్సైజ్ పోలీసులు రెండు రోజుల్లోనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిలో కుంట్రపాకంలో పార్వతి, తుమ్మలగుంట వద్ద సిద్ధవటం వెంకటరమణ ఉన్నారు. వెంకటరమణ నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తుంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.



'చినబాబు' దందాలు.. అధికారుల బెంబేలు!

- పార్టీ నగర అధ్యక్షుడి హోదాలో హల్‌చల్
- కాంట్రాక్ట్ పనుల్లో వాటా కోసం యథేచ్ఛగా ఒత్తిడి
- మంత్రులు లోకేష్.. నారాయణ పేర్లు చెప్పి బెదిరింపులు

తిరుపతి తుడా : కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అధికారులకు సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. మూడు పార్టీల నేతల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. షాడో ఎమ్మెల్యేలతో నానా అవస్థలు పడుతుంటే.. సందట్లో సడేమియా అన్నట్టు నాయకుల ఒత్తిడితో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పెత్తనం కోసం కూటమి నేతలు కుమ్ములాటకు దిగుతున్నారు. ఇప్పటికే కార్పొరేషన్ గెస్ట్‌హౌస్ ఓ ఎమ్మెల్యే చేతుల్లోకి వెళ్లిపోయింది. తిరుమలలోని తుడా అతిథిగృహం సైతం ఆయన అన్న కుమారుడి చేతిలో ఉంది. మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ పనుల కోసం ఓ టీడీపీ నాయకుడి అండతో ముష్టి యుద్ధమే జరిగింది. ఈ క్రమంలోనే ప్రధాన పార్టీకి చెందిన నగర అధ్యక్షుడి దందాలు తిరుపతిలో శృతిమించాయి. అన్ని విభాగాల్లో ఆయన తలదూర్చి నానా యాగీ చేస్తున్నారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. చివరకు ఐఏఎస్‌లను సైతం బెదిరించేందుకు యత్నిస్తున్నారు. తన మాట వినలేదని ఏకంగా ఇన్‌చార్జి మంత్రికే ఫిర్యాదు కూడా చేశారు. అలాగే రెవెన్యూ, పోలీస్, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులకు సైతం ఆయన నుంచి బెదిరింపులు తప్పడం లేదు.

చినబాబుకు పెద్ద కోరికలే..!

ఆయన ప్రధాన పార్టీకి నగర అధ్యక్షుడు. పేరులో శివ కేశవులు మిళితమై ఉంటారు. అయితే ఆఅందరూ ।చినబాబు। అంటూ సంబోధిస్తుంటారు. పార్టీ అధికారంలోకి రావడంతో ఈ చిన్న బాబుకు పెద్ద కోరికలే పుట్టుకొచ్చాయి. నగర అధ్యక్షుడి హోదాను అడ్డుపెట్టుకొని అవినీతి, అక్రమాలు సాగిస్తున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా మౌర్య బాధ్యతలు చేపట్టే సమయంలో ఆమెను కలిసేందుకు వచ్చారు. వెంటనే తనను లోపలికి పంపలేదని సిబ్బందిని దుర్భాషలాడారు. కార్పొరేషన్ ఏ పని చేపట్టాలన్నా తనకు ముందస్తు సమాచారం ఇవ్వాలని హుకుం జారీ చేశారు.

కమీషన్ ఇవ్వాల్సిందే..!

కాంట్రాక్ట్ పనుల్లో తనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అవసరమైతే మంత్రి లోకేష్ నుంచి చెప్పిస్తానంటూ సదరు పార్టీ నగర అధ్యక్షుడు దర్జా వెలగబెడుతుంటారు. ఈ క్రమంలో తనకు రూ.కోటి పనులు అప్పగించాలని ఆదేశించాడు. కమిషనర్ అంగీకరించకపోవడంతో తన పరిధిలో రెండు వర్కులుగా వాటిని వేరు చేసి రూ. 20 లక్షల పనులు కొట్టేశారు. అలాగే 22 మంది పేర్లతో ఓ జాబితా ఇచ్చి అత్యవసరంగా వారికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అలా ఇవ్వడం కుదరదని చెప్పడంతో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు వెంటనే ఫిర్యాదు చేశారు. పైగా ఆ అధికారులంతా వైఎస్సార్ సీపీ వాళ్లే అంటూ బురదజల్లే ప్రయత్నం చేశారు. ఆయన ఆగడాలపై ఆ పార్టీకి చెందిన నేతలే పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ప్రత్యేక చాంబర్ కోసం..!

మున్సిపల్ కార్పొరేషన్ లో ఓ పార్టీకి నగర అధ్యక్షుడైన ఆయనకు ప్రత్యేక చాంబర్ కావాలంటూ కమిషనర్ మౌర్యపై ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయంలో రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తికి అధికారికంగా చాంబర్ ఎలా కేటాయిస్తారన్న కనీస జ్ఞానం కూడా లేకుండా వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నా మాట పెడచెవిని పెడతారా? నీ మీద ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాను? నిన్ను ఇక్కడ కమిషనర్‌గా ఎలా వేశారు? నా మాటకే అడ్డు చెబుతావా? నువ్వు ఇక్కడ ఎలా పని చేస్తావో చూస్తా అంటూ ఆ మహిళా ఐఏఎస్ అధికారిపై కన్నెర్ర చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కమిషనర్ మౌర్య పెళ్లికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారని ఆమెకు వైఎస్సార్‌సీపీ ముద్ర వేసే ప్రయత్నం చేశారు. ఈ ఫిర్యాదుపై ఇన్‌చార్జి మంత్రి ఆరా తీయగా సదరు పార్టీ నగర అధ్యక్షుడి వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని నాయకులతో మంత్రి చెప్పినట్లు తెలుస్తోంది.

పెరిగిన ఆగడాలు

చినబాబు ఆగడాలు పెరిగిపోయాయని అధికారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు రెవెన్యూ, పోలీస్, యూనివర్సిటీలు, ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ ఆసుపత్రుల్లోను ఆయన దందాలు ఎక్కువైనట్లు ఆరోపిస్తున్నారు. మంది మార్బలంతో వెళ్లి దర్జాగా అధికారుల ముందు కూర్చుని దౌర్జన్యంగా పనులు చేయించుకుంటున్నారని విమర్శిస్తున్నారు. మంత్రి లోకేష్‌కు ఫోన్ చేయమంటావా? మంత్రి నారాయణకు కాల్ చేయమంటావా? అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన కార్యాలయంలోకి వస్తున్నారంటేనే హడలిపోతున్నామని అధికారులు వాపోతున్నారు.

భూమన ప్రమాణ స్వీకారానికి తరలిరండి



మాట్లాడుతున్న దొరబాబు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం భూమన కరుణాకర రెడ్డి చేయనున్న ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు పిలుపునిచ్చారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలోని నయారా పెట్రోల్ బంకు వద్దనున్న హోటల్ సదరన్ స్పైస్ సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై ఆదివారం ఉదయం 9 గంటలకు భూమన కరుణాకరరెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. లీగల్ సెల్ తిరుపతి నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి వేల్ మురుగన్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

తిరుపతి కల్చరల్: వడమాలపేట మండలం ఏఎం పురం ఎస్టీకాలనీలో చిన్నారిని హత్య చేసిన నిందితుడు సుశాంత్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలైన గంజాయి, సారాయి తదితరాలతోనే యువత పక్కదారి పడుతోందని వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం, ఐదు ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

లార్వా నియంత్రణకు డ్రోన్లతో మందుల పిచికారీ



వినాయక సాగర్ వద్ద మందు పిచికారీని పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా డ్రోన్లతో మందులు పిచికారీ చేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. ఆమె శనివారం వినాయక సాగర్ వద్ద డ్రోన్లతో చేస్తున్న మందు పిచికారీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందుతున్నట్లు గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేస్తున్నామని, నిల్వ ఉన్న నీటిలోని దోమ లార్వాలను నాశనం చేసేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నామని వెల్లడించారు. దోమల వృద్ధి ఎక్కువగా ఉన్న 32 ప్రాంతాలతో పాటు మొత్తం 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1:4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ 20 ఎకరాల్లో ఈ మందులు చల్లే కార్యక్రమం చేస్తున్నామని, 15 రోజులకొకసారి స్ప్రేయింగ్ చేస్తామన్నారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చోరీలు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రయాణికుల సెల్ ఫోన్లు, బ్యాగులను చోరీ చేస్తున్నారు. భక్తుల భద్రత కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. అధికారులు ఇటీవల రెండు రోజులు మాత్రమే సీసీ కెమెరాలను పరిశీలించి చర్యలు చేపట్టారు. తర్వాత పట్టించుకోవడం మానేశారు. తిరుపతి బస్టాండ్‌లో శ్రీహరి, శ్రీనివాస, ఏడు కొండలు, పల్లెవెలుగు పేరుతో నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ఈ బస్టాండ్ ఆధారంగా రోజు 3.500 ట్రిప్పులు వివిధ సర్వీసులు తిరుగుతున్నాయి. 1.20 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆశించిన మేరకు భద్రతా సిబ్బంది లేకపోవడంతో పాటు సీసీ కెమెరాల పనితీరుపై నిఘా పెట్టకపోవడంతో చోరీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వదిలి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కపిలతీర్థంలో విశేష పూజలు ప్రారంభం



కపిలతీర్థంలో కొలువైన పంచమూర్తులు



పంచమూర్తులకు స్నపన తిరుమంజనం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని కపిలతీర్థంలో వెలసిన కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం గణపతి హోమంతోపాటు విశేష పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో నెల రోజులు హోమాలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం పంచమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, పర్యవగ్నికరణ, కలశస్థాపన, అగ్రిప్రతిష్ట, గణపతి హోమం, లఘు పూర్ణాహుతి చేపట్టారు. ఆది, సోమవారాల్లో గణపతి హోమం నిర్వహించనున్నారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు సుబ్రమణ్యస్వామి హోమం నిర్వహిస్తారు. 7న సాయంత్రం 5.30 గటలకు శ్రీసుబ్రమణ్యస్వామి కల్యాణం చేపడతారు. 8న దక్షిణామూర్తి హోమం, 9న నవగ్రహ హోమం, 10 నుంచి 18వ తేదీ వరకు చండీ హోమం, 19 నుంచి 29వ తేదీ వరకు రుద్ర హోమం నిర్వహించనున్నారు. 29న శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. 30న కాలభైరవ స్వామి హోమం, డిసెంబర్ 1న చండికేశ్వరస్వామి హోమం, త్రిశూలస్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవంతో హోమ మహోత్సవాలు పూర్తవుతాయి. రూ.500లు చెల్లించి ఇద్దరు గృహస్తులు ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణవర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రోగులకు మెరుగైన సేవలకు కృషి



స్విమ్స్‌లో రోగులతో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, ఇతర భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌తో కలిసి స్విమ్స్‌లోని వివిధ విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరాతీశారు. మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు రోగుల సంఖ్య పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జనరల్ వార్డు, పద్మావతి ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యులు రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగుల సహాయకుల గదిని పరిశీలించి అక్కడున్న వారితో టీటీడీ అందిస్తున్న భోజనం, వైద్య సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ మనోహరం, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, ఈఈలు ప్రసాద్, మల్లికార్జున్, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎంవో డాక్టర్ కోటిరెడ్డి, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనలో విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య

తిరుపతి సిటీ: ఉన్నత లక్ష్యాల సాధనలో విద్యార్థి దశ కీలకమని వెటర్నరీ వర్సిటీ డీన్ కె.వీరబ్రహ్మయ్య తెలిపారు. వెటర్నరీ వర్సిటీలోని పశువైద్య కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఇక్కడ నాణ్యమైన విద్య అందజేస్తామని, అధునాతన వసతులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి జగపతి రామయ్య మాట్లాడుతూ కొత్తగా బీవీఎస్సీ, ఏహెచ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కళాశాలలోని మౌలిక సదుపాయాలు, బోధన వసతులు, ల్యాబ్‌ల వివరాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృత కార్యక్రమాలు అలరించాయి. డాక్టర్ వేణు పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ





సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పాకాల: పట్టణంలోని క్రైస్తవులు శనివారం సమాధుల పండుగ (ఆల్ సోల్స్‌డే)ను ఘనంగా జరుపుకున్నారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆంథోనిరాజ్ సమక్షంలో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా సమాధులను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించారు. క్రైస్తవులు తమ కుటుంబంలో మృతి చెందిన వారి సమాధుల వద్ద వారికి ఇష్టమైన పలహారాలు ఉంచారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రాఘవేశ, పాస్టరేట్ కమిటీ సభ్యులు, నన్స్, సీఎస్ఐ, ఆర్‌సీఎంకు చెందిన క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



ప్రమాదాల నివారణపై చర్చిస్తున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం శనివారం చంద్రగిరి, తిరుపతి రూరల్ సీఐలు సుబ్బరామిరెడ్డి, చిన్నగోవిందుతో కలిసి ముక్కోటి నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలను పరిశీలించారు. రోడ్డు చిన్నదిగా ఉండడం, మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం, రోడ్డుకు ఇరువైపులా దట్టమైన పొదలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు పొదలను తొలగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

మళ్లీ మొదలైన రేషన్ కష్టాలు



ప్రశాంతి నగర్‌లో రేషన్ కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

చంద్రగిరి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెల్లకార్డు దారులకు రేషన్ తిప్పలు మళ్లీ మొదలయ్యాయి. రేషన్ దుకాణం వద్ద గంటల తరబడి క్యూలో ఉంటేనే బియ్యం, ఇతర వస్తువులు తీసుకునే పరిస్థితి నెలకొంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకే పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున ఎండీయూ వాహనాలను సమకూర్చారు. దీంతో ప్రతి తెల్లరేషన్ కార్డుదారుడూ ఇంటి వద్దనే రేషన్ బియ్యం తీసుకునేవాడు. గత వ్యవస్థకు మంగళం పాడుతూ సీఎం చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. పనులు వదులుకుని సుమారు 2 గంటల పాటు క్యూలో వేచి ఉండాల్సి వస్తోందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

పాకాల: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పలు అభి వృద్ధి పనులకు భూమి పూజ చేశారు. గుంతల రహిత రహదారులు కార్యక్రమంలో భాగంగా ఈ-పాలగుట్టపల్లి- శేషాపురం రోడ్డులో మరమ్మతులు చేపట్టారు. అలాగే పాకాల సమీపంలో జిమ్‌ని ప్రారంభించారు. ఎస్‌వీఎస్ స్కూల్, భారతంమిట్ట 7వ క్రాస్, పాత సీఐ కార్యాలయం వద్ద మురుగు కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ శ్రీనివాసులు, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీడీవో శశిరేఖ, తహసీల్దార్ నిత్యానందబాబు పాల్గొన్నారు.

చెంగల్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



ఈడీ తిమ్మాడి చెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజా రవాణా అధికారిగా చెంగల్‌రెడ్డి చేసిన సేవలు ఆర్టీసీ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గురున్నాథం కొనియాడారు. విజయవాడ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చెంగల్‌రెడ్డి పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను శనివారం ఆర్టీసీ తిరుపతి ప్రధాన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌గా, తిరుపతి జిల్లాకు ప్రజా రవాణా అధికారిగా ఏడేళ్లు విశేష సేవలు అందించారని తెలిపారు. తిరుమల బ్రహ్మోత్సవాలతో పాటు జిల్లాలోని పలు ఆలయాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆర్టీసీ రాబడిని పెంచడంలో ఆయన తీసుకున్న చొరవ అందరికీ ఆదర్శమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందున్నారని, కొత్తగా జిల్లా ప్రజా రవాణా అధికారి కూడా అలాగే సహకరించాలని కోరారు. జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నేతలు ఆవుల ప్రభాకర్ యాదవ్, సత్యనారాయణ, ఈఆర్ కుమార్, మురుగమ్మ, మస్తాన్, విజయకుమార్, మధుతోపాటు జిల్లాలోని 11 డిపోలకు చెందిన గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్లు



సత్యనారాయణపురం సర్కిల్ వద్ద దెబ్బతిన్న కల్వర్టు



మున్సిపల్ పార్క్ ఎదురుగా అధ్వానంగా ఉన్న రోడ్డు

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలోని రోడ్లు అడుగుకో గుంత పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై చిన్నపాటి గుంత కూడా ఉండకుండా చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఒక్క గుంతలోనూ మట్టి పోసిన దాఖలాలు లేవు. తిరుపతి నగరంలోని జీవకోన నుంచి ప్రతి రోజూ వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు సత్యనారాయణపురం సర్కిల్ మీదగా మున్సిపల్ పార్క్ ఎదుట ఉన్న రోడ్డులో ప్రయాణం సాగిస్తుంటారు. ఈ రోడ్డులో గుంతలు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సత్యనారాయణపురం సర్కిల్ నుంచి రత్నం స్కూల్ వరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ఆ స్కూల్ నుంచి వంద మీటర్ల సీసీరోడ్డు నిర్మాణం చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక మార్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో పాటు కార్పొరేషన్ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్క్ ఎదురుగా సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే సత్యనారాయణపురం సర్కిల్ వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.